జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 9 | మే | 2026 ◆ పేజీలు : 5


# సెన్సస్–2027 నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- డీసీఓ భారతి హోళీ కేరి



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 8,(ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో సెన్సస్–2027 కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని

మిగతా 2 లో...

# సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

- ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ అంకిత్



**సుజాతనగర్ ప్రజాజ్యోతి మే 08 :** సుజాతనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగం, ఇన్ పేషెంట్ విభాగం, మందుల గది, సిబ్బంది హాజరు నమోదు పత్రాలు, ఔట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి రోజువారీగా నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల నిర్వహణ, ల్యాబ్ సేవల పరిస్థితి, పరీక్షల ఫలితాలను రోగులకు సమయానికి అందిస్తున్న విధానంపై ఆరా తీశారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న మందుల స్టాక్,

మిగతా 2 లో...

# పాల్వంచ కార్పొరేషన్‌లో...

## ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు

# డీజిల్ దందా..?




**కొత్తగూడెం కలెక్టరేట్ / పాల్వంచ, మే 8 (ప్రజాజ్యోతి):** ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాల్సిన పాల్వంచ మున్సిపల్ కార్యాలయం ప్రస్తుతం అవినీతి ఆరోపణలతో చర్చనీయాంశంగా మారింది. చెత్త ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు, అధికారిక వాహనాల డీజిల్ వినియోగంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారిక బిల్లులకు మించి అనధికారికంగా డీజిల్ బిల్లులు సృష్టించి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న చెత్త వాహనాలకు అవసరమైన దానికంటే అధికంగా డీజిల్ చూపిస్తూ బిల్లులు తయారు చేస్తున్నట్లు సమాచారం. మరమ్మతులకు గురై నెలల తరబడి మూలన పడి ఉన్న కొన్ని ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలకు కూడా డీజిల్ వినియోగించినట్లు రికార్డులు

మిగతా 2 లో...

# మొబైల్ సందేశాలతో వాతావరణ హెచ్చరికలు

- భద్రాద్రి కొత్తగూడెం సహా పలుజిల్లాలకు ఉరుములు, ఈదురు గాలుల అలర్ట్
- వచ్చే 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- ప్రజలకు మొబైల్ మెసేజ్‌ల ద్వారా హెచ్చరికలు పంపిన అధికారులు



**కొత్తగూడెం, మే 8 ( ప్రజాజ్యోతి )** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వచ్చే 24 గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందంటూ ప్రజలకు మొబైల్ సందేశాల ద్వారా హెచ్చరికలు అందాయి. టీజీఐసీసీసీ (TGiCCC) పంపిన ఈ అలర్ట్ ప్రకారం ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కొమరం భీం ఆసిఫాబాద్,

మిగతా 2 లో...

# బాంబు నిర్వీర్య దళానికి ఎస్పీ ప్రశంసలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 8, ప్రజా జ్యోతి:** మావోయిస్టు ప్రభావిత అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలతో కలిసి నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్లలో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించిన జిల్లా బాంబు నిర్వీర్య దళం సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. మావోయిస్టులకు సంబంధించిన ఆరు డంప్‌లు, ఐదు ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన బాంబు నిర్వీర్య దళం సభ్యులను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సత్కరించారు. అదేవిధంగా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన పది పేలుడు పరికరాలను అత్యంత అప్రమత్తంగా గుర్తించి విజయవంతంగా నిర్వీర్యం చేసిన సిబ్బంది ధైర్యసాహసాలను ఎస్పీ ప్రశంసించారు. క్లిష్ట పరిస్థితుల్లో బాంబు నిర్వీర్య దళం చూపిన సమయస్ఫూర్తి, అప్రమత్తత, సేవా తపన పోలీసు శాఖకు గర్వకారణమని ఎస్పీ కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా

మిగతా 2 లో...

## సెన్సస్–2027 నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి



(మొదటి పేజీ తరువాయి...)
డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ (డీసీఓ) భారతి హోళీకేరి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. శుక్రవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఛార్జ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఓ భారతి హోళీకేరి మాట్లాడుతూ సెన్సస్–2027 కార్యక్రమం దేశ ప్రణాళికా రూపకల్పనకు కీలకమైందని తెలిపారు. జనగణనకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. డేటా నమోదు సమయంలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాంకేతిక సహాయం అవసరమైన వారికి తగిన సహకారం అందించాలని సూచించారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి, వారికి సమగ్ర శిక్షణ అందించాలని ఆదేశించారు. సెన్సస్‌కు అవసరమైన మాన్యువల్స్, సూపర్వైజర్ కిట్స్, మ్యాప్స్ తదితర సామగ్రి పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అదనపు రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో ఐ డి ఓ సి కార్యాలయం క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో సెన్సస్–2027 ఏర్పాట్లను విస్తృత స్థాయిలో చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల ఎంపిక, శిక్షణ కార్యక్రమాలు, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సెన్సస్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, డేటా ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాంబు నిర్వీర్య దళానికి ఎస్పీ ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి...)
వినియోగించుకుంటూ అటవీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించే సమయంలో భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, స్వీయ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. నూతన ఉత్సాహంతో విధులు నిర్వహిస్తూ ప్రతిభ కనబరిచిన పన్నెండు మంది బాంబు నిర్వీర్య దళం పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఆర్ఐ రవి, బాంబు నిర్వీర్య దళం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ సందేశాలతో వాతావరణ హెచ్చరికలు



(మొదటి పేజీ తరువాయి...)
మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. ఉరుములు పడే సమయంలో చెట్ల కింద నిలబడకూడదని రైతులు పంటలు, ధాన్యం రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# పాల్వంచ కార్పొరేషన్‌లో డీజిల్ దందా..?

(మొదటి పేజీ తరువాయి...)
సృష్టించి బిల్లులు క్లియర్ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఒక చెత్త ట్రాక్టర్ నుంచి పది లీటర్లకు పైగా డీజిల్ చోరీ జరిగిన ఘటన వెలుగులోకి వచ్చినప్పటికీ, ఇప్పటి వరకు అధికారుల నుంచి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని తెలుస్తోంది. దీంతో ఈ వ్యవహారంలో అంతర్గత వ్యక్తుల ప్రమేయం ఉందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.



**డీజిల్ బిల్లులపై అనుమానాలు**

ప్రతిరోజూ ఎన్ని వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి..? వాటికి ఎంత డీజిల్ అవసరం..? అధికారికంగా ఎంత బిల్లులు రాస్తున్నారు..? అనే అంశాలపై స్పష్టత లేకపోవడం గమనార్హం. కొంతమంది అధికారులు ప్రభుత్వ వాహనాలతో పాటు వ్యక్తిగత వాహనాలకు కూడా మున్సిపల్ డీజిల్ వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డీజిల్ బిల్లులు కంప్యూటర్ రికార్డుల్లో నమోదయ్యాయా..? వాటిపై ఎవరి సంతకాలు ఉన్నాయి..? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలనే డిమాండ్ బలపడుతోంది.

**ఏసీబీ విచారణ తర్వాత కూడా మారని పరిస్థితి..?**

గతంలో అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులు పాల్వంచ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కొంత అవకతవకలు గుర్తించినప్పటికీ తదుపరి చర్యలు ఎందుకు ముందుకు సాగలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది ప్రభావశీలుల అండదండలతోనే ఈ వ్యవహారాలు కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రజలకు అందుబాటులో లేని అధికారులు**

కార్పొరేషన్‌గా మారిన తర్వాత పాల్వంచలో అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆశించిన ప్రజలు ప్రస్తుతం నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ తరచూ కొత్తగూడెం–పాల్వంచ మధ్య ప్రయాణాల్లో ఉండడం, శానిటరీ విభాగ అధికారులు ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో అనేక సమస్యలు పరిష్కారం కాకుండా పేరుకుపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. శానిటరీ విభాగంలో సిబ్బంది హాజరు, బయోమెట్రిక్ నమోదు, ఫీల్డ్ విధుల నిర్వహణపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలో బయోమెట్రిక్ నమోదు చేసి బయట కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్**

పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న డీజిల్ అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యం, పరిపాలనా లోపాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పాల్వంచ కార్పొరేషన్ పరిపాలనను గాడిలో పెట్టాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, "ఫోరం ఫర్ బెటర్ పాల్వంచ" సభ్యులు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి కొంతమేర పరిష్కారం సాధించడంపై పట్టణ ప్రజలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

(మొదటి పేజీ తరువాయి...)
అవసరమైన మందుల లభ్యత, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సుజాతనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం, మొక్కజొన్న నిల్వల వివరాలను పరిశీలించి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మొక్కజొన్న తరలింపునకు తగినన్ని లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లోడింగ్, రవాణా సమస్యల కారణంగా మొక్కజొన్న కేంద్రంలోనే నిల్వ ఉండిపోతుందని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే తగినన్ని లారీలు ఏర్పాటు చేసి రవాణా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పి.ఆర్–126 రకం ధాన్యంలో "పిన్ పాయింట్ డ్యామేజ్" ఉన్నదనే కారణంతో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని స్వీకరించడం లేదని రైతులు వివరించగా, దీనిపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రైతుల ధాన్యం ఎక్కడా నిల్వ ఉండకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైనన్ని గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు, తేమ కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం రవాణా, నిల్వ, లోడింగ్ తదితర అంశాలలో సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, వైద్య అధికారులు డాక్టర్ రమేష్ కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రోటోకాల్ ను విస్మరిస్తున్న అధికారులు

- వార్డు ప్రజలపై వేధింపులు మానుకోవాలి
- కో ఆప్షన్ సభ్యుడు, అతని కుటుంబ సభ్యుల పెత్తనం ఏమిటి : కౌన్సిలర్ దండు సారయ్య.





**ఇల్లందు మే 8, ప్రజాజ్యోతి:** రాజ్యాంగ ప్రజాస్వామ్య పద్ధతిలో గెలుపొందిన తనను విస్మరిస్తూ అధికార కాంగ్రెస్ ప్రభుత్వం తన వార్డులో జరుగుతున్న అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకుండా ప్రతి అధికారిక కార్యక్రమానికి కో ఆప్షన్ సభ్యుడైన మదుగు సాంబమూర్తి, ఆయన సతీమణిని పిలిపిస్తూ పనిచేయుచుకుంటున్నారని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఆరోపించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కు ఆ వార్డు ప్రజలతో కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్ దండు సారయ్య మాట్లాడుతూ తాను గెలుపొందిన నాటి నుండి తన చేతిలో ఓడిపోయిన అధికార పార్టీకి చెందిన మదుగు సాంబమూర్తి రాజకీయ కక్ష సాధింపు వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారికంగా పంపిణీ చేసే కళ్యాణ లక్ష్మి చెక్కులు వారే పంపిణీ చేస్తున్నారని, అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి అర్హులైన వారు తమ ఓటేసారని కక్షతో వారికి ఇల్లు రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు ప్రజలపై మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, అతని కుటుంబ సభ్యుల పెత్తనం చెలాయించడం ఏమిటని, వార్డు ప్రజలపై వారి వేధింపులు మానుకోవాలని కోరారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఓట్లతో గెలిచిన తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా నూతన పంపు కనెక్షన్లను కో ఆప్షన్ సభ్యుడి తమ్ముడు మదుగు భాస్కర్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా వార్డులో వారి ఇష్టానుసారంగా మంచినీటి ట్యాంకర్లను పంపిణీ చేయడం జరుగుతుందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తదితర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో. ఎలాంటి అర్హత లేకున్నా అంతా తనదే నంటూ కోఆప్షన్ సభ్యుడి భార్య అనటం ఏమిటని ప్రశ్నించారు. వీటితోపాటు ఆ వార్డు ప్రజలు మాట్లాడుతూ శానిటేషన్ పనులు చేయించకుండా సకాలంలో త్రాగునీరు అందించకుండా సాంబమూర్తి కుటుంబ సభ్యులు సాంబమూర్తి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా వారి తీరు మార్చుకోకపోతే వార్డు ప్రజలందరూ సహకారంతో పట్టణంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

## 90 వసంతాల ఆకాశవాణి వేడుకలు

- కొత్తగూడెంలో 3కే వాక్తాన్ నిర్వహణ




**కొత్తగూడెం, మే 8 ( ప్రజాజ్యోతి )**ఆకాశవాణి 90వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా వాయిస్ ఆఫ్ నేషన్ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం 3కే వాక్తాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ టి. భరత్ జెండా ఊపి ప్రారంభించారు. కొత్తగూడెం రేడియో స్టేషన్ నుంచి ప్రారంభమైన వాక్తాన్ 14నంబర్ ఏరియా, రామవరం సెంటర్, 2టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా తిరిగి రేడియో స్టేషన్‌కు చేరుకుంది. కార్యక్రమంలో స్టేషన్ ప్రోగ్రామ్ హెడ్ కొలిపాక శంకరరావు పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఆకాశవాణి 90వ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 1936లో ప్రారంభమైన రేడియో సేవలు కాలక్రమేణా ఆకాశవాణిగా రూపాంతరం చెంది నేటికీ ప్రజలకు విశ్వసనీయ సమాచార వేదికగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆధునిక మాధ్యమాలు అందుబాటులో లేని కాలంలో ఆకాశవాణి ప్రజావాణిగా నిలిచి గ్రామీణ ప్రజలు, రైతులు, అన్ని వర్గాల శ్రోతలను అలరించిందన్నారు. బహుజన హితాయ – బహుజన సుఖాయ నినాదంతో ప్రకృతి వైపరీత్యాలు, తుఫానులు, విపత్తుల సమయంలో ప్రజలకు సమయానుకూల సమాచారాన్ని అందిస్తూ ప్రాణాలను కాపాడటంలో ఆకాశవాణి కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో రామవరం పశువైద్యులు డాక్టర్ ఆనంద్, పర్యావరణ ప్రేమికుడు నూర్వి రాజశేఖర్, స్టేషన్ సిబ్బంది, రేడియో వ్యాఖ్యాతలు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాటం ఆగదు

- మేడే స్ఫూర్తితో కార్మిక–కర్షక ఐక్య ఉద్యమాలు నిర్మించాలి
- కార్మిక ఉత్సవ్ ముగింపు సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ పిలుపు

**కొత్తగూడెం, మే 8 ( ప్రజాజ్యోతి )**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని వాటిని పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ స్పష్టం చేశారు. మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన కార్మిక ఉత్సవ్ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి సీఐటీయూ పట్టణ కన్వీనర్ భూక్య రమేష్ అధ్యక్షత వహించారు. మేడే పోరాటాల ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గం ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించుకుందని ఏజే రమేష్ గుర్తుచేశారు. కార్మికుల త్యాగాల ఫలితంగా వచ్చిన హక్కులను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో బలహీనపరుస్తోందని విమర్శించారు. ఈ కోడ్‌లు కార్మికులను మళ్లీ కట్టు బానిసలుగా మార్చే కుట్రేనని ఆరోపించారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం పని గంటల పెంపును వ్యతిరేకిస్తుండగా తెలంగాణలో మాత్రం కేంద్ర విధానాలకు అనుగుణంగా 10 గంటల పని విధానాన్ని అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న హక్కుల రక్షణ కోసం మరో చికాగో తరహా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే రాజకీయాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రజలను మభ్యపెట్టే పాలక వర్గాల మైండ్ గేమ్‌లకు లోనుకావద్దన్నారు.విజేతలకు బహుమతులు...మేడే వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రిటైర్డ్ జనరల్ మేనేజర్ మేకల కనకయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి, జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, అంబాల దుర్గమ్మ, కూరపాటి శైలజ, పట్టణ నాయకులు నందిపాటి రమేష్, జునమాల నాగేష్, రఫీ, శ్రీనివాస్, పాషా, మనీలా, శారద, ఎన్ఎస్ రాజు, గుగులోత్ సక్రాం తదితరులు పాల్గొన్నారు.





## డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ఎంపీ రఘురాం రెడ్డిని కలిసిన కార్పొరేటర్ హరిహరన్



**కొత్తగూడెం, మే 8 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో గల 55వ డివిజన్ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ సింగర హరిహరన్ ఖమ్మం–భద్రాద్రి కొత్తగూడెం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డిని ఖమ్మంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే పెండింగ్ లో ఉన్న 76 జీవో క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ఎంపీ నిధుల ద్వారా మినీ వాటర్ స్కీమ్ (పవర్ బోర్) ఏర్పాటు చేయాలని కోరారు. డివిజన్ సమగ్ర అభివృద్ధికి సహకరించాలని ఎంపీని అభ్యర్థించారు.

## స్వర్ణభద్ర కవచాలతో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

**భద్రాచలం టౌన్, మే 8, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం సందర్భంగా భక్తులకు స్వర్ణభద్రకవచాలతో దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు.



## సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి కృషి

- మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడిగా మందా నాగరాజు



**బూర్గంపహాడ్, మే 8 (ప్రజా జ్యోతి):**సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని... సర్పంచ్ ఐక్యతతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు మందా నాగరాజు అన్నారు. శుక్రవారం సర్పంచ్ ల సంఘం ఎన్నికలు నిర్వహించగా బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల సర్పంచులను సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని...ఏ సమస్య ఉన్నా పరిష్కరించేలా చూస్తానని పేర్కొన్నారు. సర్పంచ్ల సంఘం ఉపాధ్యక్షురాలిగా తాటి వాణి, బానోతు పద్మ, గుమ్మడి కృష్ణవేణి, సర్పా నాగమణి, వర్కింగ్ ప్రెసిడెంట్ పూనం సురేందర్, కోశాధికారిగా కుంజా కొండమ్మలు ఎన్నికయ్యారు. మందా నాగరాజును పలువురు సర్పంచ్లు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గుండి బాబూరావు, బానోతు సరోజ, బొర్రా సుభద్ర, పోతునూరి సూరమ్మ, బొల్లి నిరోషా, బోళ్ల సైదమ్మ, తాటి లక్ష్మి, బానోతు నరసింహ, వర్సా మంగమ్మ పాల్గొన్నారు.

## భద్రాచలం డీఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**భద్రాచలం టౌన్, మే 8 ప్రజాజ్యోతి** భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ బాధ్యు లు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణతో పాటు ఇతర నాయకులు భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్‌ను కలిసారు. ఈ సందర్భంగా డీఎస్పీకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డివిజన్ వ్యాప్తంగా ఉన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు.



# అభివృద్ధిని అడ్డుకునేందుకు తప్పుడు ఆరోపణలు

- మాధారం సర్పంచ్ గంప సుజాత



**ములకలపల్లి, మే 8, ప్రజాజ్యోతి:** గ్రామ పంచాయితీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కొంతమంది వ్యక్తులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ గంప సుజాత ఆ రోపించారు. ఇటీవల మాధా రం పంచాయతీ అధికారుల పై వస్తున్న ఆరోపణలు నేపథ్యం లో శుక్రవారం ఆమె పాత్రికేయులతో మాట్లా డారు. గత కొన్ని రోజులుగా పంచాయితీ కార్యదర్శి మరియు సిబ్బందిపై నిరాధార విమర్శలు చేస్తూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె తెలిపారు. పంచాయితీ పరిధిలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం పాలకవర్గ సమావేశాల్లో చర్చించి, సభ్యుల ఆమోదంతోనే అమలు చేస్తున్నామని సర్పంచ్ స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత అధికారులకు, ముఖ్యంగా ఎంపిడిఓ కు సమాచారం అందించామని తెలిపా రు. మహిళా సర్పంచ్‌గా తనపై మరియు సిబ్బందిపై అనవసర ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరిన ఆమె, నిరాధార ఆరోపణలు లేదా చట్టవిరుద్ధ చర్యలు కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# యువతి అదృశ్యం... కేసు నమోదు




**ములకలపల్లి, మే 06, ప్రజాజ్యోతి:** యువతి అదృశ్యమైన ఘటనపై శుక్రవారం ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన తపస్విని పాల్వంచలోని ఓ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం కళాశాలలో పని ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన తపస్విని తిరిగి ఇంటికి రాలేదు. దీం తో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం తపస్విని తండ్రి కన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి తండ్రి కన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై మధుప్రసాద్ తెలిపారు.

# పుట్టతోగులో దొరికింది అడవి జంతువు మాంసమా..?

- అటవీశాఖ అధికారుల అదుపులో ఇద్దరు వ్యక్తులు

**ములకలపల్లి, మే 08, ప్రజాజ్యోతి :** మండలంలోని పుట్టతోగు గ్రామంలో అడవి జంతువు మాంసం నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారంతో అటవీశాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదిలావుండగా స్వాధీనం చేసుకున్న మాంసం నిజంగా అది అడవి జంతువు మాంసమా ..? లేక మరేదైనా జంతువుకు చెందినదా..? అనే విషయంలో ఇంకా స్పష్టత లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు చేపట్టిన అధికారులు ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి సగం ఉడికించిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మాంసం స్వరూపాన్ని బట్టి అది అడవి జంతువుకు చెందినదై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఎలాంటి నిర్ధారణకు అధికారులు రాలేదు. ఘటన స్థలంలో వేటకు సంబంధించిన స్పష్టమైన ఆనవాళ్లు లభించాయా..? లేదా..? అనే విషయంపై కూడా అధికారులు పూర్తి వివరాలు వెల్లడించలేదు. గ్రామంలో అడవి జంతువుల వేట జరిగిందన్న ప్రచారం సాగుతున్న నేపథ్యంలో, అసలు ఏ జంతువుకు చెందిన మాంసమన్న దానిపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, ల్యాబ్ నివేదిక వచ్చే వరకు ఎలాంటి తుది నిర్ణయానికి రావొద్దని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై స్థానిక ఫారెస్ట్ రేంజర్ రవికిరణ్ మాట్లాడుతూ.. "గ్రామంలో అడవి జంతువుకు చెందిన మాంసం ఉన్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించాం. ఇద్దరి వద్ద నుంచి సగం ఉడికించిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నాం. అది అడవి జంతువు మాంసమేనా కాదా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించాం. నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం" తెలిపారు ఇద్దరు వ్యక్తుల అదుపులోకి తీసుకోని విచారణ చేస్తున్నాం. రేంజర్ తెలిపారు.

# నేరగాళ్లకు జైలు శిక్ష : భద్రాచలం కోర్టు సంచలన తీర్పు

- సెల్ ఫోన్ దొంగకు ఏడు నెలలు..
- వసూళ్లకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు




**భద్రాచలం టౌన్, మే 08 , ప్రజాజ్యోతి** భద్రాచలం పట్టణంలో వేర్వేరు కేసుల్లో నిందితులకు స్థానిక జ్యూడీషియల్ మే జిస్ట్రేట్ కోర్టు జైలు శిక్ష విధిస్తూ గురువారం కీలక తీర్పు వెలువరించింది. సెల్ ఫోన్ దొంగతనానికి పాల్పడిన ఒకరికి, అలాగే బెదిరించి డబ్బులు వసూలు చేసిన మరొకరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వి. శివనాయక్ తీర్పునిచ్చారు. కేసుల వివరాలు ఇలా ఉన్నాయి..

**ఫోన్ దొంగిలిస్తే ఏడు నెలల శిక్ష....**

భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన సెల్ ఫోన్ దొంగతనం కేసు (CC No. 530/ 2022) లో బండారు సాయితేజ అనే వ్యక్తిపై నేరం రుజువైంది. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడికి ఏడు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు 500రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

**వసూళ్లకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలలు....**

మరొక కేసులో, బెదిరింపులకు పాల్ప డి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన కేసులో నిందితుడికి శిక్ష పడింది. 2018లో భద్రాచలం టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసు (CC No. 483/2018) పై సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు తీర్పునిచ్చింది. కొత్తపేట కాలనీకి చెందిన దూడల దయామూర్తి (వృత్తిరీత్యా లాయర్) బెదిరింపులకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో, ఆయనకు ఆరు నెలల జైలు శిక్ష, 500 రూపాయల జరిమానా విధి స్తూ న్యాయమూర్తి శివనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. నేరాలకు పాల్పడితే చట్టం ముందు తప్పించుకోలేరని ఈ తీర్పుల ద్వారా స్పష్టమైంది.

# ప్రత్యేక శిక్షణా తరగతులతో ఉత్తీర్ణత శాతం పెంచాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**పాల్వంచ, మే 8, ప్రజాజ్యోతి:** పాల్వంచ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కళాశాలలో సప్లమెంటరీ క్యాంప్‌ను పరిశీలించిన కలెక్టర్ పాల్వంచలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కళాశాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులను శుక్రవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ప్రత్యేక తరగతి గదులను సందర్శించిన జిల్లా కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు, రోజువారీగా ఎన్ని గంటలు చదువుతున్నారు, ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు ఎంతవరకు అర్థమవుతున్నాయి వంటి అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఇంటర్‌లో ఫెయిల్ అయ్యామని నిరుత్సాహపడకుండా, ఈ ప్రత్యేక శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి పాఠాన్ని శ్రద్ధగా విని, సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని, ప్రతిరోజూ పునశ్చరణకు సమయం కేటాయించాలని తెలిపారు. క్రమశిక్షణతో చదువుతూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. గత ప్రశ్నాపత్రాలను సాధన చేయడం, ముఖ్యమైన ప్రశ్నలను నోట్స్ రూపంలో సిద్ధం చేసుకోవడం ద్వారా మెరుగైన మార్కులు సాధించే అవకాశం ఉంటుందని విద్యార్థులకు వివరించారు. జువాలజీ, బయాలజీ, ఫిజిక్స్, తెలుగు తదితర సబ్జెక్టుల ప్రత్యేక తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఉపాధ్యాయులతో మాట్లాడి ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేసి బోధన కొనసాగించాలని సూచించారు. బలహీనంగా ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అదనపు సమయం కేటాయిస్తూ ప్రణాళికాబద్ధంగా శిక్షణ అందించాలని ఆదేశించారు. ప్రతిరోజూ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతిని సమీక్షించాలని తెలిపారు. ప్రత్యేక శిక్షణా తరగతుల ప్రధాన ఉద్దేశ్యం ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమేనని, అందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిని మానసికంగా ప్రోత్సహించే విధంగా బోధన ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపులో మొత్తం 48 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్నలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

- ఎంపీటీసీ - జడ్పీటిసి ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి
- కామ్రేడ్ ముత్యాల విశ్వనాథం




**పాల్వంచ, మే 8, ప్రజాజ్యోతి:** సిపిఐ పాల్వంచ మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం సిపిఐ కార్యాలయంలో చిల్లా కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ముత్యాల విశ్వనాథం పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న వరి ధాన్యం, మొక్కజొన్న, వేరుశెనగ తదితర పంటలను సీసీఐ ద్వారా ఎటువంటి ఆంక్షలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు పూర్తి మద్దతు ధర చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిపిఐ కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ గృహాల మంజూరులో విడతల వారీగా కొందరికే ఇళ్లు ఇవ్వడం వల్ల మిగిలిన అర్హులు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కమిటీల పేరుతో కొందరి వద్ద డబ్బులు వసూలు చేస్తూ అర్హుల జాబితాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామాల్లో నిజమైన అర్హులను గుర్తించి, అర్హులందరికీ ఒకే విడతలో ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పోడు భూముల సమస్యపై మాట్లాడుతూ, సర్వే పూర్తి చేసినప్పటికీ గిరిజన, గిరిజనేతర సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో ఫారెస్ట్ అధికారులు ట్రెంచ్‌లు తీస్తామని, మొక్కలు నాటుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీంతో పోడు సాగుదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సర్వే చేసిన భూములకు హక్కు పత్రాలు జారీ చేసి, ఫారెస్ట్ అధికారుల వేధింపులను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పాల్వంచ మండల కార్యదర్శి కామ్రేడ్ వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, మండల నాయకులు కొంగర అప్పారావు, ఉండ్రాతి రవి, వడ్లకొండ మేరమ్మ, యండూరి ప్రభావతి, వగెల పద్మ, ఇరుకులపాటి సుధాకర్, భూక్య రమేష్, ఎల్లంకి శివరావు, మేక రాంబాబు, కొంక వెంకటరత్నం, లాల్ పాషా, మందపాటి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియాపై గర్భిణీలకు అవగాహన సదస్సు



**చర్ల, మే 08 (ప్రజాజ్యోతి):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చర్ల మండలం సత్యనారాయణపురం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు రక్తహీనత (అనీమియా), తలసేమియా వ్యాధులపై ప్రత్యేక అవగాహన సదస్సు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మహిళల్లో పెరుగుతున్న రక్తహీనత సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్య అధికారులు తెలిపారు.ఈ సదస్సులో పాల్గొన్న గర్భిణీలకు వైద్యులు రక్తహీనత వల్ల కలిగే ప్రమాదాలు తలసేమియా వ్యాధి లక్షణాలు ముందస్తు జాగ్రత్తలు చికిత్స విధానాలపై సమగ్రంగా వివరించారు. గర్భిణీలు గర్భధారణ ప్రారంభం నుంచే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి నైని మాట్లాడుతూ గర్భిణీ సమయంలో రక్తహీనత ఏర్పడితే తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదలపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందని చెప్పారు. అలసట, తలనొప్పి, బలహీనత, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తలసేమియా వంటి జన్యుపరమైన వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు పరీక్షలు అవసరమని వివరించారు.గర్భిణీలు ప్రతిరోజూ ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను తీసుకోవడంతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, పాలు, గుడ్లు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మహిళలు ఎక్కువగా రక్తహీనత, తలసేమియా సమస్యలతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు ప్రతి వారం ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో ఉండడం ఎంతో అవసరమని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని వినియోగించుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండగలరని తెలిపారు.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ప్రతి మహిళ ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వాలంటే సరైన పోషకాహారం వైద్య పర్యవేక్షణ అత్యంత అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణపురం పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై అవగాహన

- ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు



**పినపాక,మే 08(ప్రజాజ్యోతి):** పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో పశువుల అక్రమ రవాణాపై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ, పాల ఉత్పత్తుల అవసరాల కోసం పశువులను రవాణా చేయాలంటే వెటర్నరీ శాఖ అనుమతి, పంచాయతీ కార్యదర్శి నుంచి రహదారి పత్రం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అలాగే వాహనాల్లో పశువులకు సరిపడా స్థలం, గాలి, వెలుతురు, ఆహారం ఉండేలా ఫిట్నెస్ కలిగిన వాహనాల్లోనే రవాణా చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడుళ్ల బయ్యారం ఎస్సై సురేష్, వెటర్నరీ వైద్యులు ఉజ్వల, వాసంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పశువులకు ఆరోగ్య పరీక్షలు... మందులు పంపిణీ

- వెటర్నరీ వైద్యులు ఉజ్వల, శిరీష



**పినపాక,మే 08(ప్రజాజ్యోతి ):** పినపాక మండలం ఈ బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ శిబిరంలో పశువుల సంతానోత్పత్తి శిబిరం, దూడల ర్యాలీ, పశువుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ ఉజ్వల తెలిపారు.ఈ సందర్భంగా పశువులకు అవసరమైన మల్టీవిటమిన్లు, మినరల్ మిక్చర్లు, డీవార్మింగ్ మందులు పంపిణీ చేశారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, సంరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. దూడల ర్యాలీలో పాల్గొన్న రైతులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ వాగబోయిన చందర్రావు, ఉప సర్పంచ్ గంగిరెడ్డి సందీప్ రెడ్డి, పినపాక వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ శిరీష, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

## తాలిపేరు వద్ద సాగునీటి సమీక్ష

- గేట్ల నిర్వహణ, నీటి పారుదలపై అధికారుల సూచనలు
- కాలువల ఆక్రమణలు నివారించాలని రైతులకు పిలుపు






**చర్ల, మే 08(ప్రజా జ్యోతి ):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా తాలిపేరు డ్యామ్ వద్ద సమర్థ నీటి పారుదల, గేట్ల నిర్వహణ అంశాలపై రైతులకు శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు సాగు నీటి వినియోగం, డ్యామ్ సంరక్షణ, కాలువల పరిరక్షణ వంటి అంశాలపై అధికారులు వివరించారు.ఈ సందర్భంగా డీఈఈ తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాలిపేరు డ్యామ్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనుల వివరాలను రైతులకు తెలియజేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిని వివరించడంతో పాటు డ్యామ్ గేట్ల మరమ్మతులు, పెయింటింగ్ పనులు సమయానికి చేపట్టడం వల్ల డ్యామ్ భద్రతతో పాటు సాగునీటి సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేసేందుకు శాఖ కృషి చేస్తోందన్నారు.పెద్దమిడిసిలేరు సర్పంచ్ సుహాసిని మాట్లాడుతూ తాలిపేరు డ్యామ్ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.డ్యామ్ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. రైతులు, అధికారులు ఒకే వేదికపై చర్చించుకునే ఇటువంటి కార్యక్రమాలు సమస్యల పరిష్కారానికి దోహదపడతాయని తెలిపారు.శ్యామల రామారావు మాట్లాడుతూ రైతులు కాలువలను ఆక్రమించకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సాగునీటి కాలువలు సక్రమంగా ఉండడం వల్ల చివరి ఎకరా వరకు నీరు అందుతుందని తెలిపారు. రైతుల చిన్న చిన్న సమస్యలను ఇరిగేషన్ శాఖ సహకారంతో పరిష్కరించుకొని సాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సహాయక కార్యనిర్వాహక ఇంజినీర్ సంపత్, సహాయక ఇంజినీర్ సుమన, పెద్దమిడిసిలేరు కార్యదర్శి ప్రశాంతి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు పినపాక మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పినపాక,మే 08(ప్రజాజ్యోతి):** 11 కేవీ మల్లారం ఫీడర్ లైన్లో చెట్ల కొమ్మలు తొలగింపు పనులు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జి. వేణుగోపాల్ తెలిపారు. ఈ పనుల కారణంగా గడ్డంపల్లి, పొట్లపల్లి, గడ్డిగూడెం, ఉలవచెలక ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల భద్రత, అంతరాయం లేకుండా సరఫరా కొనసాగేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కావున ఆయా గ్రామాల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు శాఖకు సహకరించాలని కోరారు. పనులు పూర్తైన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు వెల్లడించారు.

## మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- మాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలి
- మాల మహానాడు మండల కమిటీ డిమాండ్



**మణుగూరు, మే 08 (ప్రజాజ్యోతి) :** చేవెళ్ల డిక్లరేషన్ లో దళితులకోసం మాల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే సాక్షిగా ఇచ్చిన హామీలలో భాగంగా మాల కార్పొరేషన్ ను తక్షణమే ఏర్పాటు చేయాలని మాల మహానాడు మణుగూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేర్పుల నరేష్, బూర్గుల సతీష్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పా ల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పలు కులాలకు కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి నిధులు కేటాయించటం హర్షించదగ్గ విషయమైనప్పటికీ, అది కేవలం ఉపన్యాసాలకు మాత్రమే పరిమితమైందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవటం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. తక్షణమే మాల కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి రెండువేల కోట్ల రూపాయలు కేటాయించి మాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మాలలు కంకనబద్ధులై పనిచేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ మాలలను అణిచివేస్తూ మీనమేషాలు వేస్తూ అన్యాయం చేస్తుందని భగ్గుమన్నారు. వర్గీకరణ ద్వారా మాలలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు దక్కకుండా చేసిన ప్రభుత్వం కాం గ్రెస్ ప్రభుత్వమే అని తీవ్రంగా విమర్శించారు. మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా ఆర్థికంగా మాలలను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి తక్షణమే మాల కార్పొరేషన్ ను ఏ ర్పాటు చేసి జాతిపట్ల నిబద్ధత కలగి, అభివృద్ధికి కృషి చేసి మాలల పట్ల వారికున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు గౌ రవ అధ్యక్షులు మద్దెల భద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వేర్పుల సురేష్,ఉపాధ్యక్షులు బూర్గుల సంజీవరావు, తోట ప్రసాద్, వేల్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన 2026-27 స్వీయ నమోదు ప్రక్రియకు ప్రజల సహకారం అవసరం

- మే 10 వరకు అవకాశం : చుంచుపల్లి తహసీల్దార్



**చుంచుపల్లి , మే 8 ( ప్రజాజ్యోతి )** జనగణన 2026–27 కార్యక్రమంలో భాగం గా నిర్వహిస్తున్న స్వీయ గణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని చుంచుపల్లి తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం ఆదేశాల మేరకు సుజాతానగర్ మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగ న్ వాడీ టీచర్లు, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు స్వీయ గణన కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వీయ గణన నమోదు ప్రక్రియకు 10–05–2026ను చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీయ గణన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే ఈ సమాచారాన్ని ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా మిత్రులు విస్తృతంగా ప్రచారం చేయాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.